ఊపందుకున్న 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఉపాధి హామీ పనులు ఊబందుకున్నట్లు ఎపిఒ చెన్నకేశవులు తెలిపారు. మండలంలో ఉన్న అన్ని పంచాయతీలలో ఉపాధి పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని పనులు చేస్తున్నట్టు తెలిపారు. శనివారం మండలంలోని దేవలపల్లిలో ఉపాధి పనులు చేయడానికి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉపాధి పనుల ద్వారా ఇంకుడు గుంతలు తవ్వడం వంటివి చేస్తూ వేసవి కాలంలో పనులు లేని సందర్భంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి పనులు వారికి ఎంతో ఉపాధిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కూలీకి సుమారు రూ.200 నుంచి రూ300 వరకు కూలీ గిట్టుబాటు అవుతున్నట్లు పేర్కొన్నారు.

దేవులపల్లి వద్ద పనులు చేస్తున్న కూలీలు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- వేరుశనగ వైపు మొగ్గు
- సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలంటున్న రైతులు

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలో వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేస్తారు. ఏటా ఖరీఫ్‌లో ఎన్ని కష్టాలున్నా అప్పుచేసి వేరుశనగ పంట సాగు చేస్తారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా పడుతాయనే ఆశతో రైతులు సాగుకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో దుక్కులు చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు సాగు పెట్టుబడుల కోసం బ్యాంకు చుట్టూ, వడ్డీ వ్యాపారుల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో డి, రాచపల్లి, వంగిమళ్ళ, సోమవరం, సంఘం వాండ్లపల్లి, పెద్దివీడు, మట్లి, ఓదివీడు, సానిపాయి, గుర్రప్ప గారి పల్లి, వీరబల్లి, గడికోట, గ్రామాలలో ఏటా ఖరీఫ్‌లో 500 మంది రైతులు 500 ఎకరాలు వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. వరి పంట 2 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల దశాబ్దాల కాలంగా వేరుశనగ రైతు నష్టమే సంభవించేది. .ఆశలు వదలని రైతులు పట్టు వదలని ్టి విక్రమార్కుల్లా చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా బ్యాంకు రుణమో, బంగారు నగలు తాకట్టు పెట్టైయినా అప్పులు తెచ్చి పంట సాగుకు శ్రీకారం చుడుతున్నారు. గతంలో వేరుశనగ సాగు చేయడానికి ఎకరాకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, కూలీలు, పంట నూర్పిడి, వంటి పనులకు రూ.30 వేల వరకు ఖర్చు అయ్యేది. ఈ ఏడాది డీజిల్ ధరలు, నిత్యావసరాలు, ఛార్జీలు పెరగడంతోపాటు కూలి రేట్లు కూడా పెంచారు. దీంతో ఎకరాకు రూ 30 వేల నుంచి రూ 45 వరకు వెచ్చించాల్సి వస్తుంది. రసాయనక ఎరువులు, విత్తనాల కొనుగోలు, కూలీల ఖర్చులు పెరగడమే కానీ తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడిన పంటను సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు చేతికందే అవకాశాలు తగ్గిపోతున్నాయి.

ప్రారంభమైన దుక్కులు

ఈనెలలో అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలాల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు, తొలగిస్తున్నారు. వర్షానికి గట్లు తెగిపోకుండా వర్షపు నీరు నిలబడాలని పొలం చుట్టూ పెద్ద పెద్ద గట్లు వేస్తున్నారు. దున్నకాలు మొదలు కావడంతో ట్రాక్టర్లకు డిమాండ్ ఏర్పడుతుంది. మరికొందరు దిబ్బ ఎరువులు కొనుగోలు చేసి పొలంలో వేసుకుంటున్నారు. సకాలంలో దున్నకాలు చేసుకొని ఎరువులు చల్లుకుంటే ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేసిన వెంటనే విత్తన కాయలు కొనుగోలు చేస్తారు.

ప్రభుత్వం రాయితీ విత్తనాలు ఇవ్వాలి

ప్రతి ఏటా రాయితీ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నా అదే ధరకు బహిరంగ మార్కెట్లోనూ లభిస్తున్నాయి. రైతన్నలను ఆదుకోవడానికి ప్రభుత్వం 50 శాతం రాయితీ విత్తనాలు ఇవ్వాలని కోరుకుంటున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో పూర్తిస్థాయిలో నిల్వచేసి నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించాలి. సింగల్ విండో మహిళా సంఘాలకు, రైతు సంఘాలకు, సబ్సిడీ ట్రాక్టర్లను ఇవ్వాలి.వ్యవసాయ పనిముట్లు, రెయిన్ గన్‌లు, పివిసి పైపులు, స్ప్రింక్లర్ల పైపులు అందుబాటులో ఉండాలని రైతులు కోరుతున్నారు.

- వెంకటరమణ, రైతు మిత్ర సంఘం అధ్యక్షులు.

రాజంపేటలో వర్షం..రోడ్డన్నీ జలమయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా తపాలా కార్యాలయం, తిరుపతి రహదారిలలో వర్షపు నీరు చేరి జలమయమవడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. తేలికపాటి వర్షం వచ్చినా పట్టణంలోని ప్రధాన రహదారులు వర్షపు నీటితో పాటు డ్రెయినేజీ నీరుతో కలిసిపోయి ప్రజల రాకపోకలు, నిత్యకార్యకలాపాలకు ఇబ్బందిగా మారుతూ ఉండడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తపాలా కార్యాలయం వద్ద జలమయమైన రోడ్డు

చదువుకు పేదరికం అడ్డుకాదు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్‌వివిడి విద్యా సంస్థల్లో ఇటీవల నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు వివిఎన్ ఫ్రైడ్ అధినేత ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌వివిడి విద్యా సంస్థల అధినేత నూకల శ్రీరాములు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు బాగా కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించి సభ సంస్థలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిఎన్ ఫ్రైడ్ అధినేత ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించాలని చదువుకు పేదరికం అడ్డు కాకూడదని తెలియజేశారు. రానున్న రోజుల్లో ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ముందుంటామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ మాట్లాడుతూ కళాశాలలో రానున్న విద్యా సంవత్సరం నుండి గౌతమ్ విద్యా సంస్థలు హైదరాబాదు వారి సహకారంతో ఎంసెట్ నీట్ కోచింగ్‌తో పాటు కంప్యూటర్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కూడా బాగా చదివి ఉన్నత స్థితికి ఎదిగితే ఉపాధ్యాయులకు విద్యార్థులు ఇచ్చే బహుమతని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చలమయ్య, సభ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్‌రెడ్డి, విద్యా సంస్థల కమిటీ మెంబర్లు, పుర ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రూపానందరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి

చంద్రబాబును కలిసిన 'ముక్కా', 'మండిపల్లి'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/రాయచోటి

టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం వేర్వేరుగా రైల్వేకోడూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, రాయచోటి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల గురించి కూటమి జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్ తప్పక విజయం సాధిస్తామని చంద్రబాబుకు వివరించారు. ఎన్నికల ముందు అనంతరం జరిగిన సంఘటనల గురించి చంద్రబాబుతో చర్చించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు లోపు, ఓట్ల లెక్కింపు రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. చంద్రబాబుతో రాంప్రసాద్‌రెడ్డిరాయచోటి నియోజకవర్గంలో జరిగిన ఎలక్షన్ల సరళి గురించి ఆయనకు వివరించారు. టిడిపి గెలవబోతోందని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం పార్టీ నేనని కార్యకర్తలు, నాయకులు అధైర్య పడద్దని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారని చెప్పారు.

ఉద్యోగుల పోరాట ఉద్యమాన్ని కొనసాగిస్తాం

ప్రజాశక్తి- రాయచోటి

10,117 కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ కోసం కొత్త ప్రభుత్వం రాగానే ధర్మ పోరాట ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏపి డిఎస్‌సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగ నియామక విధానాన్ని రద్దు చేయాలని, రెగ్యులర్ విధానంలోనే నియామకాలన్ని చేపట్టాలని, అన్ని విధాలా అర్హులైన కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. పై డిమాండ్లతో అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

కడప గౌస్‌నగర్ ఘటనపై

సిఐ, ఐదుగురు ఎస్ఐలకు ఛార్జ్‌మెమో

ప్రజాశక్తి-కడపఅర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున కడప నగరంలోని గౌస్‌నగర్‌లో రెండు గ్రూపుల మధ్య రాళ్ల దాడులు జరిగిన ఘటనపై వైఎస్ఆర్ జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న సిఐ, ఐదుగురు ఎస్ఐలకు ఛార్జ్‌మెమో జారీ జారీ చేశారు. కడప వన్‌టౌన్ సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు రంగస్వామి, తిరుపాల్ నాయక్, మహమ్మద్ రఫీ, ఎర్రన్న, అలీఖాన్‌కు ఛార్జ్ మెమోలు పంపించారు. వీరందరిపైన శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 13వ తేదీన కడప నగరంలోని గౌస్‌నగర్‌లో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య జరిగిన రాళ్ల దాడి ఘటనను పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించింది. టిడిపి కార్యకర్తలపై దాడులకు తెగబడేలా వైసిపి కార్యకర్తలను ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా కుటుంబ సభ్యులు రెచ్చగొడుతూ భయానక వాతావరణం సృష్టించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎవరినీ నిలువరించలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఆ రోజు విధుల్లో ఉన్న అధికారులందరికీ ఛార్జి మెమోలు దాఖలు చేశారు. కౌంటింగ్ రోజున కూడా అల్లర్లు జరిగే అవకాశం ఉండటంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులను ఎస్‌పి ఆదేశించారు.

ఇవిఎంల్లో అభ్యర్థుల భవితవ్యం భద్రం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. ఈ ఎన్నికలలో మహిళలు అధిక శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని 1,00,663 మంది పురుషులు ఉండగా అందులో 73,7 11 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,03,794 మంది మహిళా ఓటర్లు ఉండగా అందులో 78,639 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 9 మంది ఇతరులు ఉండగా అందులో ఇద్దరు మాత్రమే ఓటు వేశారు. ఈ ఎన్నికలలో ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు,కూటమి జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్ మధ్య పోటీ తీవ్రత అధికంగా ఉంది, నియోజకవర్గంలోని చిట్వేలి, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, పెనగలూరు మండలాలలోని 252 పోలింగ్ బూత్‌లకు సంబంధించి మొత్తం 2,04,466 మంది ఓటర్లు ఉండగా అందులో 1,52,352 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూన్ 4వ తేదీన రాయచోటిలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

డాక్టర్ కావడమే లక్ష్యం

తెలంగాణ ఇఎసి సెట్ మొదటి ర్యాంకర్ ప్రణీత

ప్రజాశక్తి.మదనపల్లి

తెలంగాణ ఇఎపి సెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో మదనపల్లెకు చెందిన ఆలూరి ప్రణీత మొదటి ర్యాంకు సాధించారు. శనివారం స్థానిక మీడియాతో ఆమె మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు హోమియోపతి డాక్టర్ ఆలూరు శ్రీకర్, సైన్స్ ఉపాధ్యాయులు కళ్యాణి ప్రోత్సాహంతో మదనపల్లి, విజయవాడలో చదివానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇఎపి సెట్ రాసినట్లు తెలిపారు. అక్కడి ప్రభుత్వం ఫలితాలను ఈ రోజు వెల్లడించడంతో తెలంగాణ రాష్ట్రంలోనే ఫస్ట్ ర్యాంకును సాధించడం సంతోషంగా ఉందన్నారు. గుండె వైద్య నిపుణులు కావాలని తన ఆశయమని తెలిపారు. పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రణీత మొదటి ర్యాంకు సాధించడం పట్ల పలురువు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణీతకు స్వీట్స్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

నిధులు సకాలంలో వినియోగించుకోవాలి

- జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి

మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుల్లంపేట

మరి కొద్ది రోజుల్లో రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతున్నాయని, సకాలంలో వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పనుల పురోగతిపై సమీక్షించామని పేర్కొన్నారు. రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతున్నాయని పేర్కొన్నారు. మంజూరయ్యే నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి సచివాలయంలో స్కానర్, కంప్యూటర్ కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో ఉద్యోగులు సకాలంలో విధులు నిర్వహించాలని, ప్రతి సచివాలయాన్ని వారానికి రెండుసార్లు అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి హాజరు రిజిస్టర్, ఇంటి పన్నులు, పంచాయతీ నిర్వహణ పనులు, పారిశుధ్య వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పెంచలయ్య, ఎఒ అబీబుల్లా ఖాన్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం : జెవివి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు సమ్మర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగ పడుతాయని జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.డి. దేవదత్తం పేర్కొన్నారు. కడప నగరం రామకృష్ణ నగర్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించేందుకు సన్నద్ధ సమావేశం ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావం నాటి సంఘటనల గురించి, జనవిజ్ఞాన వేదిక విద్యార్థుల కోసం చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రతి సంవత్సరమూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరమూ జెవివి సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. వేసవి సమయంలో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞానం వినోదం తోకూడిన అంశాలు నేర్చుకోవడానికి ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జెవివి నగర కమిటీ ప్రధాన కార్యదర్శి పైడికాల్వ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కో-పరేటివ్ కాలనీలో 15 రోజులపాటు సమ్మర్ క్యాంపు నిర్వహించామని పేర్కొన్నారు. రామకృష్ణ నగర్ ప్రాంతంలోని విద్యార్థులకు సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో మ్యాజిక్, ఆటలు, పాటలు, ఓరిగామి, ఇంగ్లీషు గ్రామర్, ఈజీ మ్యాథ్స్, నీతికథలు నేర్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థిని, విద్యార్థులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంపును ఈనెల 20 నుంచి రామకృష్ణ నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో జెవివి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ ట్రెజరర్ సమీర్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీ, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అబ్దుల్ , ఐద్వా నాయకురాలు ఐఎన్ సుబ్బమ్మ, జెవివి సమతా కమిటీ సభ్యులు కామేశ్వరమ్మ, డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కల్చరల్ కమిటీ కన్వీనర్, క్రాఫ్ట్ మాస్టర్ రంగనాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా గీతం ఆలపిస్తున్న విద్యార్థి

కథల వల్ల సరైన మార్గంలో జీవిత ప్రయాణం..

జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతి సంవత్సరమూ నిర్వహిస్తున్నట్లుగా ఈ సంవత్సరం కూడా వేసవి వేసవినోద కార్యక్రమాన్ని ప్రారంభించింది. శనివారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.డి. దేవదత్తం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు "పాడుదమా స్వేచ్ఛా గీతం" "విజ్ఞానంతోనే వికసించు జగత్తు "అనే పాటలను ఆలపించారు. ఆటలు, పాటలు, కథల ద్వారా కలిగే ప్రయోజనం గురించి విద్యార్థులతో చర్చించారు. విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్ అతిగా వాడడం వలన జరిగే అనర్థాలను గురించి తెలియజేశారు. ఈ సెల్ ఫోన్ అతిగా వాడడం వల్ల కలిగే అనర్థాలగురించి విద్యార్థులే చక్కగా వివరించారు. ఆటలు సెల్ ఫోన్లలో కాకుండా గ్రౌండ్‌లో ఆడుకోవడం వల్ల కలిగేటువంటి ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ అమీరుద్దీన్ లైబ్రేరియన్ బాబ్జి, సుబ్రమణ్యం, సిబ్బంది సుబ్బమ్మ, రమణ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మంగారి రథోత్సవం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలలో భాగంగా శనివారం బ్రహ్మంగారి రథోత్సవం నేత్రప ర్వంగా సాగింది. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలలో శనివారం బ్రహ్మంగారి మఠం పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకా టాద్రి స్వామి, భద్రయ్య, వీరబ్రహ్మయ్య, దత్తాత్రేయ,. రెండవ భార్య కుమారులు, పెద్దఆచార్యులు, శ్రీ ఈశ్వరి దేవి మఠాది పతులు వీర శివ కుమార్ స్వామి ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మఠం మాడవీధుల గుండా రథోత్సవం ఊరేగించారు. భక్తులకు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య చారి ఎటువంటి ఇబ్బం దులు లేకుండా అన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఐ విద్యాసాగర్ పోలీస్ బందోబస్తు పకడ్బందీగా నిర్వహించారు. మైదుకూరు బద్వేల్ ఆర్‌టిసి డిపో వారు భక్తులకు రవాణా సౌకర్యం మెరుగ్గా కల్పించారు. ఆదివారం మహానైవేద్యంతో ఆరాధన మహోత్సవాలు ముగింపు అవుతాయి.

గ్రామాల్లో బెట్టింగుల జోరు

ప్రజాశక్తి-రామాపురం : రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామస్థాయి నాయకులు తమ పార్టీనే గెలుస్తుందని ధీమాలో ఉన్నారు. ఇందులో భాగంగా పలు గ్రామాలలో ఇరు పార్టీల వారు బెట్టింగులు పెద్ద సంఖ్యలో కడుతున్నారు. రామాపురం మండలంలో 32 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు జరిగాయి. మండలంలోని 13 గ్రామాల్లో స్థానిక ఇరు పార్టీ నాయకులు, అధినాయకుల వద్ద తామే ఓట్లు ఎక్కువ వేయించాం.. తమ పార్టీకే మెజార్టీ వస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు తమ పార్టీకే ఎక్కువ మెజార్టీ వస్తుందని నాయకులతో ఇదివరకే చెప్పుకొచ్చారు. కొన్నిచోట్ల గ్రామాల వారీగా బెట్టింగులు జరిగితే మరికొన్ని చోట్ల పోలింగ్ బూతుల వారిగా మెజార్టీ వస్తుందని బెట్టింగులు కడుతున్నారు. జూన్ 4 వరకు మండలాల్లో రకరకాలుగా నాయకులు తమ పార్టీదే పై చేయి అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సంయమనం

ప్రజాదృష్టి

జిల్లాలో ఎన్నికల హింసపై అప్రమత్తత అనివార్యం. జిల్లా ప్రజలు ఎన్నికల సమయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు పరస్పరం కలుసుకుని కరచాలనం చేసుకోవడం చూస్తూనే ఉంటాం. ఇటువంటి తరహా వాతావరణం అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన మద్దతుదారుల మధ్య ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి పరస్పరం ముఖాముఖి ఎదురు పడుతున్న మద్దతుదారులకు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ఉన్న పరిణితిని ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరి కోసమో పరస్పరం ఘర్షణ పడడం దగ్గర నుంచి అమీతుమీ తేల్చుకునే వరకు వెళ్లడం మూర్ఖమవుతుందనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. కడపలో నిన్నటి వరకు వరస ప్రెస్‌మీట్లతో దుమ్మెత్తిపోసుకున్న అభ్యర్థులు విమర్శలకే పరిమితమై, సంయమనంతో ఎన్నికలు నిర్వహించిన నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. కడప, అన్నమయ్య జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు, రాజంపేట, రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ముంగిట ఎన్నికల హింస చోటుచేసుకున్న ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని పల్నాడు, అనంతపురం, కడప, తిరుపతి జిల్లాల్లో చోటు చేసుకున్న ఎన్నికల హింసపై ఎన్నికల కమిషన్ సిట్ పేరుతో చర్యలకు కదలిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం కావడం ఆహ్వానించదగిన విషయం. పోలింగ్ ముంగిట మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం చిన్నగురవలూరులో వైసిపి, టిడిపిలకు చెందిన ఏజెంట్ల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ పట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ చురుకుగా స్పందించడం బాగానే ఉంది. జమ్మలమడుగు నియోజకవర్గం ఫ్యాక్షన్ ప్రభావితం ప్రాంతం. ఇటువంటి ప్రాంతంలో శాంతిభద్రత పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. గత ఎన్నికల చరిత్రను పరికిస్తే పరిస్థితి తీవ్రత అవగతమ వుతుంది. ఇటువంటి ప్రాంతంలో ఎమ్మెల్యే సైతం గాయపడడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాజంపేటలో ఎమ్మెల్యే డ్రైవర్‌పై దాడి, రాయచోటిలో రాళ్లదాడుల ఘటనలు చోటుసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు జమ్మలమడుగుకు చెందిన వైసిపి, టిడిపి అభ్యర్థులను జిల్లా దాటించడం వరకు బాగానే ఉంది. ఆగకుండా అప్ర మత్తంగా ఉండాలి. ఫలితాల అనంతరం మూడు నెలల నుంచి ఆర్నెల్లపాటు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలి. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలను గుర్తించి భద్రతాపరమైన ఏర్పాట్లు తీసు కోవాలి. ఇటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే ప్రయోజనం ఉంటుందనే సంగతిని గ్రహించాలి. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రత్యర్థులపై చోటుచేసుకున్న వరుస దాడులే ఇందుకు తార్కాణం. అటువంటి పరిస్థితులు పునరావృతం గాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రక్తదానం చేస్తున్న యువకులు

చిన్నారికి రక్తదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ బెంగళూరు నగరంలోని మణిపాల్ ఆసుపత్రిలో ఓ చిన్నారి చికిత్స కోసం రక్తం అవసరమని తమ ఫౌండేషన్‌కు ఫోన్ చేశారని తెలిపారు. తమ ఫౌండేషన్ సభ్యులు గిరిధర్, అ్రశఫ్, శ్రీనివాసులు సదరు చిన్నారి చికిత్సకు అవసరమైన రక్తాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా అనేక సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సకాలంలో తమ బిడ్డకు రక్తాన్ని అందించిన యంగ్ ఇండియా ఫౌండేషన్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా కుమార్

ప్రజాశక్తి-కలికిరి

ఎపిటిఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా కలికిరికి చెందిన వాల్మీకిపురం మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పోతినేని కుమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాయచోటిలో ఎపి టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగ్రలాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కుమార్ యాదవ్, కార్యదర్శిగా మహమ్మద్ ఇలియాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాజీ లేని కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి దంపతులు

సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత వారం వడదెబ్బకు గురై చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 9 గంటలకు మృతి చెందినట్లు ఆయన కుమారుడు యోగేష్‌రెడ్డి తెలిపారు. గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా అత్యధిక మెజార్టీతో గెలిచి కలికిరి పట్టణం అభివృద్ధికి విశేష కృషి చేశారు. అనంతరం పార్టీ అంతర్గత విభేదాలుతో వైసిపి పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. సమాచారం తెలుసుకున్న నల్లారి కుటుంబ సభ్యులు ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఎలాంటి అవసరం వచ్చిన వారిని తెలుగుదేశం పార్టీ, నల్లారి కుటుంబం ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రతాప్‌రెడ్డి అందించిన సేవలు, కలికిరి పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి మరువ లేనివని, మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైసిపి నాయకులు సతీష్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పీలేరు

2024-25 విద్యా సంవత్సరానికి పీలేరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో ఐటిఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్లలో ప్రవేశం పొందగోరే అభ్యర్థులు 2024 జూన్ 10వ తేదీలోగా iti.ap.gov.in అనే పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. ఇతర వివరాలకు స్థానిక తిరుపతి రోడ్డులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఉలవల గంగమ్మ జాతర

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం, తలుపుల పంచాయితీలోని శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ జాతర నిర్వహణకు చాటింపు వేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జె.వెంకటరమణ నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీలేరు-ఊస్తికాయలపెంట మార్గంలోని తలుపుల సమీపంలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ కుల, మతాలకు అతీతంగా వరపడిన భక్తుల కోర్కెలు తీరుస్తూందన్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు ఆలయ పూజారి గణేష్ రాజు ఆధ్వర్యంలో అమ్మవారి అలంకరణ, ప్రత్యేక పూజలతో జాతరను నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ జాతర కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షలకు పాత్రులవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వై.సాగర్‌రెడ్డి, జె.హరినాథ నాయుడు, జె.మల్లికార్జున నాయుడు, గుడి పూజారి గణేష్ రాజు పాల్గొన్నారు.

కంటి కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రెటినోబ్లాస్టోమా అనే కంటి కేన్సర్ పట్ల పిల్లల తల్లితండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కడప ఎల్‌విపిఇఐ రాజశేఖరరెడ్డి ప్రాంగణంలో కంటి కేన్సర్ నిపుణులు, ప్రాంగణ అధిపతి డాక్టర్ కావ్య ఎం. బెజ్జంకి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రెటినోబ్లాస్టోమా కంటి కేన్సర్ అవగాహన వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రెటినోబ్లాస్టోమా అనే కంటి కేన్సర్‌కు సంబంధించి అవగాహన కల్పించేందుకు రెండేళ్లుగా ప్రతి ఏడాది వైట్‌థాన్ పేరిట పరుగు/నడక (రన్నింగ్/వాక్) కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కంటి కేన్సర్ అత్యంత ఖరీదుతో దీర్ఘకాలం నిర్వర్తించవలసిన చికిత్స అన్నారు. సాధారణంగా రెటినోబ్లాస్టోమా అనే కంటి కేన్సర్ 3 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించుటలో జాప్యం, సరైన చికిత్స అందకపోవడం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రెటినోబ్లాస్టోమాను ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే పిల్లల జీవితం, కాంతిని, దృష్టిని కాపాడవచ్చుని తెలిపారు. బిడ్డ కంటిలో తెల్లని ప్రతిబింబం కంటి కేన్సర్‌కు ఒక సూచన కావచ్చు అని తెలిపారు. అలా కనిపిస్తే కంటి నిపుణుడిని వెంటనే సంప్రదించాలని చెప్పారు. తద్వారా ప్రాణాన్ని, కంటిని, బిడ్డ చూపును రక్షించవచ్చునని తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా ఆదినిమ్మాయపల్లె డ్యామ్

- హెచ్చరిక బోర్డు లేకనే ప్రమాదాలు
- ఒకే నెలలో ముగ్గురు మృతి

నీటికుంటలో పడి మృతిచెందిన మోహన్‌సాయి (ఫైల్‌ఫోటో)

డ్యామ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న నీటి కుంటలు

ప్రజాశక్తి -వల్లూరు

ఆదినిమ్మాయపల్లె డ్యామ్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ప్రమాదాలు అధికంగా అక్కడ సూచిక బోర్డు లేకపోవడమేనని స్థానికులు పేర్కొంటున్నారు. డ్యామ్‌ను సెలువు రోజుల్లో, పండ గలప్పుడు పర్యాటకులు సందర్శిస్తుంటారు. ఇక్కడ నీటిలో సరదాగా గడుపుతుంటారు. ఇలా నీటిలో దిగి ప్రాణాలు పోగొట్టుకున్న వారు చాలా మందే ఉన్నారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ప్రమాదకరమైన నీటి గుంటలున్నాయి. వాటి గురించి తెలియని వారు అందులో దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటువంటి సమయంలో ఎక్కడైతే ప్రమాదాలు జరుగుతాయో అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే పర్యాటకులు అక్కడికి వెళ్లకుండా జాగ్రత్త పడుతారు. ఒకే నెలలోనే ఆదినిమ్మాయపల్లె డ్యామ్‌లో పడి ముగ్గురు మృతిచెందారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాల నివారణకు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు పేర్కొ ంటున్నారు.

అధికారులు స్పందించాలి..

అదినిమ్మాయపల్లి డ్యాం వద్ద పర్యాటకుల సందర్శుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఎంతోమంది సరదాగా గడపడానికి దూర ప్రాంతాల నుంచి డ్యామ్ వద్దకు వచ్చి నీటిలో గడు పుతూ ఉంటారు. అక్కడక్కడ సుడిగుండాలు, గుంతలు ఉండడంతో వారికి అవగాహన లేక నీటి కుంటలో పడి మృతి చెందుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించాలంటే తప్పనిసరిగా ప్రమాద సూచిక బోర్డులు అక్కడక్కడా మడుగులు ఉన్నచోట ఏర్పాటు చేస్తే వారి ప్రాణాలు వాళ్లే రక్షించుకునే అవకాశం ఎక్కువగా ఉంది. ఎన్నోసార్లు మృతి చెందిన వారిని నేనే బయటకు తీశాను. అధికారులు వెంటనే స్పందించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

-అంజిరెడ్డి, స్థానికుడు

ఘనంగా వాసవి మాత జయంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వాసవి మాత శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. సూర్యోదయాత్పూర్వమే అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనార్థం కొలువుదీర్చారు. వేద పండితులు కన్యకా పరమేశ్వరిదేవి చరిత్రను భక్తులకు వివరించారు. వాసవి మాత జయంతిని పురస్కరించుకొని వాసన్ ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రందే సత్యనారాయణ గుప్త, ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్యనారాయణ, నటకల రామకృష్ణ, అయిత సుబ్రహ్మణ్యం, మెంటా విజయ శేఖర్, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆలయ అర్చకులు మృత్యుంజయ స్వామి ఆధ్వర్యంలో ఉదయం మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభి షేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ఎదురుగా భక్తులకు అన్నదాన వితరణ గావించారు. సాయంత్రం వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పూలతో ముస్తాబు చేసి గ్రామోత్సవానికి వాహనంపై కొలువు తీర్చారు. అనంతరం అమ్మవారి శాల నుండి స్థానిక బస్టాండ్ కూడలి వరకు గ్రామోత్సవాన్ని కోలాటాల నడుమ పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆర్యవైశ్య మహిళలు సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయంలో కేకును ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, వైస్ ప్రెసిడెంట్ మాకం వెంకట కుమార్ చలపాటి నరసింహ శెట్టి, సెక్రటరీ గెలివి కుమార్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గెలివి మల్లికార్జున శెట్టి, మేడా వెంకట కుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షులు గెలివి జయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు యంబలూరు అనిల్ కుమార్, గెలివి లోకేష్, వల్లంకొండు చంద్రశేఖర్, వల్లంకొండు శివ, ఎంబలూరు నరసింహ ప్రసాద్, గోపిశెట్టి రఘు, గెలివి నరేష్, తులసి గిరి, దరిశ హేమంత్, భూపాలం సునీల్ పాల్గొన్నారు.

'పుచ్చలపల్లి'ని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - బద్వేలు

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలను అన్ని శాఖలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాలని ప్రజాసంఘాల కన్వీనర్ కె. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడుగా, స్వతంత్ర సమరయోధుడుగా, కమ్యూనిస్టు గాంధీగా పేరొందారని చెప్పారు. సుందరయ్య తెలుగు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖులన్నారు. కుల వ్యవస్థను నిరసించారన్నారు. పుచ్చలపల్లి సుందర్ రామిరెడ్డిలోని రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నారని చెప్పారు. సహచరులు ఆయన్ను కామ్రేడ్ పిఎస్ అనే ముద్దుగా పిలిచేవారని తెలిపారు. ఇతను నిరాడంబరతో ఆదర్శ జీవితం గడిపారన్నారు. పార్లమెంట్ సభ్యునిగా సుదీర్ఘకాలం పని చేశారన్నారు. ఆ సమయంలో పార్లమెంట్ కూడా సైకిల్ పై వెళ్లేవారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మహిళా నాయకులు మోక్షమ్మ, రాములమ్మ, కైరున్ బి.మస్తాన్ బి.బాలమ్మ, సుబ్బమ్మ, రాణమ్మ నాగమ్మ, రత్నమ్మ, డివైఎఫ్ఐ నాయకులు గంగనపల్లి నాగార్జున, ఉప్పులూరు ఆంజనేయులు, పి.సురేంద్ర, మల్లికార్జున, సిఐటియు నాయకులు కొండయ్య, రాజగోపాల్, వృత్తిదారుల నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసులు

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

19 సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు, ఘర్షణలకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి వినోద్‌కుమార్

పులివెందుల రూరల్ : విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘాఉంచినట్లు డిఎస్‌పి వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన ఆ పరిధిలోని సిఐలు, విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కలెక్టర్, ఎస్‌పి ఆదేశాల మేరకు ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పులివెందుల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 19 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామన్నారు. ఇప్పటికే ఆ గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో 440 మంది రౌడీషీటర్లు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ప్రతిరోజు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా పోలీసులకు సహరించాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వ్యక్తులపై, ఆ పోస్టులను షేర్ చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జూన్ 4న ఎన్నికలు ఫలితాలు రానున్నాయని, ఆ రోజున ఎవరైనా కొత్త వ్యక్తులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ఎవరు కూడా బాణాసంచా పేల్చవద్దన్నారు. ర్యాలీలు, ఊరేగింపులను నిషేధించామన్నారు ఎన్నికల కోడ్ ఎత్తివేసే బాణసంచా పేల్చడం, సభలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. బైండోవర్ చేసిన వారు ఎవరైనా ఘర్షణలకు పాలపడుతున్నట్లు తెలిసినా కూడా అట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ శంకర్‌రెడ్డి, రూరల్ సిఐ మద్దిలేటి, సబ్ డివిజన్ సిఐలు పాల్గొన్నారు.

అభ్యర్థులు సహకరించిన తీరు అభినందనీయం : డిఎస్‌పి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలీసులకు సహకరించిన తీరును అభినందిస్తూ.. జూన్ 4న జరుగు ఎన్నికల లెక్కింపు సమయం వరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఎటువంటి భంగం వాటిల్లినా నిష్పక్షపాతంగా వ్యవహరించి కఠినచర్యలు తీసుకుంటామని డిఎస్‌పి మురళీధర్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల సలహాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పార్టీల ట్రబుల్ మాంగ్లర్స్‌ను స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. అనవసరంగా ఘర్షణలకు దిగడం, ఘర్షణలను ప్రోత్సహించడం సహించబోమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అనుచరులు, కార్యకర్తలు అనవసర ఘర్షణలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఏ పార్టీ నాయకులను, కార్యకర్తలనుగానీ తాము ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదన్నారు. ప్రొద్దుటూరులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు కౌన్సిలింగ్ కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అక్కడి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఎలాంటి ఘర్షణలకు తావివ్వొద్దని సూచించారు. వారికి కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ శ్రీకాంత్, త్రీటౌన్ సిఐ వెంకటరమణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు హర్షణీయం : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్యపై మాట్లాడ వద్దంటూ కడప కోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను పేదల పక్షం, తాను పేదల ప్రతినిధినని ఒక వైపు చెప్పుకుంటూ మరో వైపు ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యులతో స్పెషల్ లగ్జరీ విమానంలో విదేశాలకు విహారయాత్రకు పోవడం విడ్డూరమన్నారు. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదన్నారు. కానీ ఈ ఎన్నికల్లో టిడిపి, వైసిపి నాయకులు రూ.20 కోట్ల నుండి రూ.40 కోట్ల వరకు ఖర్చు చేశారన్నారు. ఓటుకు రూ.1000 నుండి రూ.5 వేల వరకు బహిరంగంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. దీన్ని అరికట్టడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. డబ్బులు లేని పార్టీలు, డబ్బులు లేని నాయకులు పోటీ చేసే పరిస్థితి లేదన్నారు. ప్రజాస్వామ్యం స్థానంలో ధనస్వామ్యం చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ మైనుద్దీన్

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని జమ్మలమడుగు ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి భార్గవి అన్నారు. మండలంలోని కె.రాఘవపురం గ్రామంలో శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంలో మహి ళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలు హక్కుల గురించి తెలుసు కోవాలన్నారు. వివాదాలకు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగులో ఉన్న కేసులను రానున్న లోక్‌అదాలత్‌లో రాజీ ద్వారా సులభంగా పరిష్కారం చేసుకోవచ్చు అన్నారు. రాజీ పడడం రాజమార్గమన్నారు. ఎస్ఐ మైనుద్దీన్ మాట్లాడుతూ నేరాలు పలు రకాలుగా ఉంటాయన్నారు. ముఖ్యంగా జరిగే సైబర్ మోసాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిటి సాయి సౌజన్య, కానిస్టేబుల్ రమేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. మోటర్ వెహికల్ యాక్ట్ గురించి వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లల వివాహాలపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కల్పన, న్యాయవాదులు లక్ష్మీ మహేశ్వరి, సూర్య పెద్దిరాజు, సురేంద్ర, పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ సిబ్బంది

జాబ్‌మేళాలో 24 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కడప కొప్పర్తిలోని ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమాన్ని కంపెనీ హెచ్‌ఆర్ రిక్రూట్మెంట్ మేనేజర్ ప్రహల్లాద్, వంశీకిషోర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగం ఆవశ్య కతను విద్యార్థులకు వివరించారు. కళాశాలకు చెందిన 57 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. 24 మంది ఎంపికయ్యారని, వారికి కళాశాల తర పున అభినందన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్‌రెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పచ్చిరొట్ట ఎరువులకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, జనుములు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తుందని, కావాల్సినవారు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి 650 క్వింటాళ్ల జీలగలు, 35 క్వింటాళ్ల జనుములు మంజూరయ్యాయని తెలిపారు. జీలుగలు ఎకరాకు 10కిలోలు ధర రూ.440, జనుములు ఎకరాకు 10కిలోలు ధర రూ.670కి అందిస్తామన్నారు. రైతులు ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్, సెల్ ఫోన్ తీసుకురావాలన్నారు. సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేపడతామని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత పచ్చిరొట్ట ఎరువుల విత్తన పంపిణీ ఉంటుందన్నారు.

దాతలకు ఆంజనేయ చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

అన్నదానానికి రూ.3.89 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - చక్రాయపేట : జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వారితో గండి క్షేత్రం కిక్కిరిసింది. వేసవి సెల వులు కావడంతో జిల్లా నలుమూలల నుండి భక్తులు తరలి రావడంతో గండి దేవస్థానానికి ఆదాయం పెరిగింది. శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దువ్వూరు మండలం పెద్ద బాకరాపురం వాస్తవ్యులు ఉమ్మడి ఆంజనేయులు ధర్మపత్ని వెంకటలక్ష్మి గారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేశారు. వీరికి ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేష వస్త్రం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మెన్ కావలి క్రిష్ణతేజ తెలిపారు.

సేవ ద్వారానే గుర్తింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సేవా కార్యక్రమాల ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు వస్తుం దని దివంగత నేత ఎంవిఆర్ కుమారుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు ప్రాణదాత సేవాసమితి నిర్వా హకులకు ఓ మినీ వాహ నాన్ని కొనుగోలు చేసేందుకని మురళీ ధర్‌రెడ్డి శనివారం రూ.1.5 లక్ష చెక్కును అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అవ సరార్థులకు అన్న దానం కార్యక్రమం నిర్వి ఘ్నంగా జరగాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, భీముడు, రామకృష్ణ పాల్గొన్నారు.

మహారాజ రాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి రాయచోటి వారి కోర్టులో

O.S.No. 17/2023

శెట్టిపల్లి వెంకటరమణారెడ్డి, S/o కొండారెడ్డి, వయస్సు 45 సం॥లు, డోర్‌నెం.14/9, అంకంవాండ్లపల్లి, H/o దుద్యాల గ్రామం, సంబేపల్లి మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

శెట్టిపల్లి వెంకటసుబ్బారెడ్డి, S/o Late క్రిష్ణారెడ్డి, వయస్సు 48 సం॥, పొట్టిరెడ్డిగారి పల్లె, H/o దుద్యాల గ్రామం, సంబేపల్లి మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

సమను/ నోటీసు

పై నెంబరు దావాలోని వాది అయిన శెట్టిపల్లి వెంకటరమణారెడ్డి, ప్రతివాది శెట్టిపల్లి వెంకటసుబ్బారెడ్డి అయిన మీపైనా బాండు బాపతి విషయమై దావా దాఖలు చేసియున్నారు. ఇందులో ప్రతివాది అయిన మీరు, కోర్టు వారి సమనుకు అందనందువలన ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా, ప్రతివాది అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది: 27.06.2024న ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మాణించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 27.6.2024

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

వై.రమేష్‌రెడ్డి, బి.ఎ., బి.యల్.,
వాది తరపు న్యాయవాది, రాయచోటి.